# 11. శాంతమ్మ

వాతావరణం ముసురు ముసురుగా ఉంది. ఉత్తముసురే. వాన వచ్చేదీ లేదు, చచ్చేదీ లేదు! మజ్జాన్నం దాకా ఇట్నే ముసురు ముసురుగా ఉండి, ఫెళఫెళా ఎండొచ్చిద్ది! అంతే. వారం రోజుల్నించీ ఇట్నే...

నిజంగా కురిసే వానయితే చెప్పా పెట్టకుండా ధమధమలాడుతూ వచ్చి ఒక బాదుబాది కుంటలూ చెరువులూ ఏకం చేసిపోయిద్ది. కానీ... అసుంటి వాన ఇంక కలే! అసుంటి వానని రైతులు ఇంక ఏం చూడబోతారో!

కుంటలూ, చెరువులూ నిండి కళకళ్ళాడి ఏ నాలుగైదు ఏళ్ళు అయిందో! అవి ఎండి బీటలు వారిపోయాయి.

దిగులు కూడూ, దిగులు బతుకూ అయిపోయింది రైతులకు.

రెండు బరిగొడ్లు, పడ్డదూడ మూటినీ వాగుల్లోనూ, వంకల్లోనూ తిప్పి మేపుకోవడానికి తోలుకుపోతున్న బుచ్చియ్య మనసు కూడా వాతావరణంలాగే ముసురుగా, చీకటిగా ఉంది.

రెండు నెల్లనించీ ఇంట్లో తగాదా! రోజూ గొడవలే!

అరుచుకోవటం, తిట్టుకోవటం, తన్నుకోవటం, అలగటం, పస్తులుండటం!

మంచో చెడో మొగుడూ పెళ్ళాం ఒక మాటమీద పోతే తగాదాలు ఉండవు. కానీ ఎంతసేపటికీ దానిమాటే చెల్లాలంటే ఎట్టా?

దాని మాట మీద పోబట్టే కాపరం ఈ గతి పట్టింది.

ఇప్పటికైనా తొందరపడకపోతే లాభం లేదు. తాడోపేడో తేల్చుకోవాలి! ఇప్పటికే తల బొప్పికట్టి పోయింది. ఎల్లకాలం తను ఈ బాధలు పడలేడు.

గొడ్లు డొంకదిగి, ప్రక్కనే ఉన్న అడవి తుమ్మచెట్ల గుట్టల్లోనికి దారి తీశాయి.

"ఎహై... ఎహై... హైహై...దారిన నడిచి చావండే" బూతులు తిడుతూ వాటిని డొంక మీదకి మళ్ళించడానికి రాళ్ళు విసిరాడు.

వాటికి వేయడానికి ఇంటికాడ మేతలేదు.

వాగుల్లోనూ, వంకల్లోనూ, చెలకల్లోనూ మాత్రం ఏం ఉంది? ఎక్కడా ఏం లేదు.

గొడ్లని విప్పి తిప్పుతూ మేయమంటే ఏం ఉందని మేస్తాయి? ఎండకీ, గాలికీ తిరిగొస్తే ఆకలై, వాటి ముందు ఏ కంపనో, కట్టెనో పడేస్తే చచ్చినట్టు తింటాయని వాటిని తోలుకుని రావడమే.

ఇంక పదీ పన్నెండు రోజులుంటే ఆ మేతా అయిపోయిద్దేమో! తరువాత ఎట్టచేయాలో, ఏం పాడో!

తనకి ఒక బాధ కాదు. ఒక వాన పడితే బాగుండు. గడ్డో గాదమో తెచ్చుకోవచ్చు. ముందు గొడ్ల కడుపులు నిండుతాయి.

వాన ఆలోచన రావడంతో తలెత్తి మేఘాలవైపు ఆశగా చూశాడు బుచ్చియ్య. మేఘాలు బాగా తారట్లాడుతున్నాయి. చీకట్లు ముసురు కుంటున్నాయి. చిన్న జల్లు అయినా పడొచ్చు. పడితే బాగుండు.

ఆలోచిస్తూ, తన సమస్యని ఎలా పరిష్కారం చేసుకోవాలో, భార్యని తన దారికి ఎలా తెచ్చుకోవాలో అనుకుంటూ గొడ్లని చౌటి వాగులోనికి తోలుకుపోయాడు.

అప్పటికే అక్కడ గొడ్లని మేపుకుంటూ మట్టిదిబ్బ మీద కూర్చుని ఉంది రంగమ్మ.

"ఏం రంగమ్మప్పా... ఇయ్యాల నువ్వు వచ్చావేం గొడ్లకాడికి? మామని ఏ దేశం పంపిచ్చా?"

"నేను పంపిచ్చేదేముందీ? నా మాటల్లో ఉన్నాడా ఏంది మీ మామ నేను పంపిచ్చడానికి?"

"మరి... నీ మాటని అచ్చరం దాటడానికి మామకి ఎన్ని గుండెలు ఉండాలి? నువ్వు కూసోమంటే కూసోవాలి, లేవమంటే లేవాలి గదా!"

"సడేలే సంబడం! ఎవురన్నా యింటే నిజమనుకుంటారు?"

"మరి అబద్ధమేందీ?"

"పైకేగనీ... తను చేయాలనుకున్న పని మెత్తగా చేస్తాడబ్బాయి మీ మామ! ఎవురి మాట ఆలకిచ్చడు. రేపు పోదువులే అంటన్నా యినకుండా ఎగురుకుంటా రాసపూడి పోయాడు కూతురి దగ్గరికి. మనవడి మీద గుబులు మళ్ళిందంట! లేడికి లేచిందే పరుగని రేపు పోదువులే అంటే యింటేగదూ!"

"మనవడికి ఎన్నేళ్ళేంది?"

"మొన్ననే ఐదో ఏడు వచ్చింది. మాటల పుట్ట! మనవడు అంటే ఎంత బెమో ఈయనకి?" మురిసిపోతూ చెప్పింది రంగమ్మ.

"అయితే అల్లుడోళ్ళ పని బాగుందంటప్పా?"

అప్పటిదాకా నవ్వుతూ మాట్లాడుతున్న రంగమ్మ ముఖం వేలాడేసుకుని, విచారపడుతున్నట్టుగా అంది.

"ఏం బాగుంటం అబ్బాయి? వాళ్ళూ పొలం పని చేసుకునే వాళ్ళే. ఉజ్జోగస్తులా నెలనెలా ముద్దర సుద్దిగా జీతాలు వస్తయ్యనుకోడానికీ! ఒకేడు పండుతుంటే రెండేళ్ళు ఎండుతుండే!"

"అవును. రైతుల రోజులు కాదు ఇయ్యి?"

"సరేగానీ మొన్న ఏందీ మీ ఇంట్లో గోలా? అర్ధరేతిరి దాకా మొగుడూ పెళ్ళాలు అరుసుకుంటన్నారూ"

వాళ్ళ ఇద్దరిదీ ఒకే వీధి. దగ్గర దగ్గర ఇళ్ళు.

"ఇంటింటికో కతనీ... మా ఎవారానిదే ముందిలే అప్పా. చెప్పుకుంటే సిగ్గుపోద్ది. మొండిది. పెడసరపు మడిసి. దానిగుండా బతికినంతకాలం చెరలేనప్పా. రాచి రంపాన పెడతందనుకో. ఏం పాపం చేస్తినో పంపకమయింది నాకు" భార్య మీద కోపం వెళ్ళగక్కుతూ కసిగా అన్నాడు బుచ్చియ్య.

"ఏం చేసిందేంది?"

"వద్దన్న పని చేయాలంటండే! ఎడ్డెం అంటే తెడ్డెం! ఈదేవాడికి తెలిసిద్దిగనీ లోతూ, దానికేం ఒడ్డున ఉండి చెప్పడమేనాయె. పెతిదీ అంతేనప్పా. దానిగుండా కాపరం నాశనం అయిపోయిందనుకో. చచ్చే చావొచ్చింది"

"నువ్వు అంటన్నావు కానీ శాంతమ్మ అంత తెలివి తక్కువదేం కాదు బుచ్చియ్యా. మంచి మనిషీ మహా తెలివి కలిగినదీ అయితే..."

"ఏం తెలివీ? అత్తెలివి! ఆ తెలివేం అక్కరకొచ్చింది? మా బాధలు చెబితే తీరేయ్యి కాదులే అప్పా" నిరాశగా అన్నాడు బుచ్చియ్య.

గొడ్లు కొంత దూరం వెళ్తే, పరిగెత్తుకుంటూ వెళ్ళి, వాటిని వెనక్కి మలిపాడు.

"కొద్దిగా గొడ్లు కనిపెట్టి చూస్తుండు అప్పా. చేనుదాకా పోయొస్తాను. పక్కచేలోళ్ళతోటి బొగు గొడవ. గట్టులూ గనేలూ ఉంచకుండా దుంతుంటారు! చేనంతా పండి చచ్చినట్టూ గట్టుల్లో వాళ్ళ తాత సొమ్మంతా పోయినట్టూ"

"సరే పోయిరా. గొడ్లు మాత్రం ఎక్కడికి పోతయ్యిలే? ఎక్కడికి పోయినా ఏముంది చిండ"

బుచ్చియ్య అక్కడికి దగ్గరలోనేఉన్న తన పొలం దగ్గరికి వెళ్ళాడు.

పక్క చేను ట్రాక్టరుతో నాగళ్ళు దున్నించి ఉంది.

బుచ్చియ్య చేను నాలుగు వైపులా తిరిగి చూసుకున్నాడు, సరిహద్దు రాళ్ళు పొరుగు చేలవాళ్ళు కదిలించారేమో అని. రాత్రికి రాత్రే రాళ్ళు పీకి నాటేవాళ్ళు కూడా చాలా మంది వుంటారు.

అర గొర్రు చేను అది. నాలుగేళ్ళ కిందట 60 వేలుపెట్టి కొన్నాడు. ఈ నాలుగేళ్ళ నించీ ఆ చేను మీద నాలుగు రూపాయలు తిన్నది లేదు, ఎదురు పెట్టడమే తప్ప. అరవై వేలు పెట్టి కొన్న చేన్ని ఇయ్యాల ముప్పయ్ వేలకి అడుగుతున్నారు. అప్పుడు ఎకరా నలభై వేలయితే ఇప్పుడు ఇరవై వేలు!

కూలికిపోయీ, రేయింబొగుళ్ళూ చాకిరీ చేసీ, తినీ తినకా పైసా పైసా కలిపి ముడేస్తే యాభై వేలు అయ్యాయి. పదేళ్ళపాటు రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన సొమ్ము అది.

ఈ పొలం బేరానికి వచ్చింది.

తన భార్య శాంతమ్మ పొలం కొందాం అంది.

"పొలం ఎందుకే మనకి? ఉన్న రెండెకరాల పొలం పండించుకుంటే చాలు. డబ్బులు ఉంటే అవసరానికి అక్కరకి వస్తయ్యి కానీ పొలం ఏం అక్కరకి వచ్చిద్ది?"

"డబ్బు నిలుపుకోవడం కష్టమయ్యా. లచ్చిందేవి కుదురుగా ఒక చోట నిలబడదంట. అయినోళ్ళో, మరొకరో అప్పు అడుగుతారు. ఇస్తాం. డబ్బు ఇంట్లో పెట్టకోంగా! వాళ్ళకి పొర్లక తిరిగి ఇయ్యలేకపోతే తగాదాలు. అయినోళ్ళు పగ అవతారు. డబ్బుకి డబ్బూ పోయి శని చుట్టుకునిద్ది"

"డబ్బులు ఎవరికీ ఇయ్యొద్దు. బేంకిలో యేసుకుందాం. అంతేగనీ పొలంకొని ఉన్న డబ్బు ఎక్కడ పోగొట్టుకుందాం."

"పొలం కొనుక్కుంటే స్థిరాస్తి ఏర్పడిద్ది. రేపు బిడ్డలకి అక్కరకి వచ్చిద్ది. డబ్బు ఉండేనూ, పొయ్యేనూ ఎవరికి తెల్సూ? పొలం కొనాల్సిందే" అని మొండికి పడింది శాంతమ్మ.

ఆమె తన పంతం నెగ్గిందాకా ఊరుకునే మనిషి కాదు. వారం రోజులపాటు ఇంట్లో రభస చేసింది. ఒక రోజు అన్నం వండలేదు. రెండు రోజులు అన్నం తినలేదు. అలిగి పస్తు పడుకుంది. చివరికి తను దిగివచ్చాడు.

"చూస్తా చూస్తా యాభైయి వేలు వాళ్ళ ముకాన దారపోస్తున్నాం కదే!పదేళ్ళ కష్టార్జితం!"

"అట్ట మాట్టాడవాకు, ఎవురన్నా యింటే బాగుండదు. మనం వాళ్ళకి ఊరక ఏం ఇయ్యడంలా! నాలుగు తరాల్నించీ ఉన్న పొలం వాళ్ళు మనకి ఇస్తున్నారు" అంది శాంతమ్మ.

బేరం జరిగింది. అరవై వేలకి కుదిరింది. వంద రూపాయలు బయానా ఇచ్చారు.

"మన దగ్గర యాభై వేలే వున్నయ్యి. పది వేలు అప్పు తేవాలి. రేపు ఆ బాకీ ఎట్ట తీర్చాలి? అప్పుచేసి పప్పుకూడు తిన్నట్టు ఉండిద్ది. నా జన్మలో నేను ఇంతవరకూ అప్పుచేసి ఎరగను. అప్పు అంటే నిప్పే. బయానా వంద రూపాయలు పోతేపోయాయి, మానుకుందాం!" అన్నాడు తను, ఎలాగైనా పొలం కొనకుండా చివరి నిమిషంలో అయినా భార్యని ఒప్పించాలనే ఉద్దేశంతో

"అప్పుచేసి మనం దుబారా చేయడంలా. పొలం కొంటన్నాం. పండాలకానీ ఒక్క మాసూల్లోనే బాకీ తుడిచిపెట్టుకుని పోయిద్ది" అంది శాంతమ్మ.

చివరకి పది వేలు అప్పు తీసుకొచ్చి సొంత డబ్బుతో కలిపి పొలం కొన్నారు.

ఆ బాకీ అలాగే నిలబడి పోయింది.

తను జీవితంలో అప్పు చేసింది మొదటిగా ఈ పొలం కోసమే! ఇక చిన్న చిన్నగా ఒక్కో అప్పూ, ఒక్కో అప్పూ అలా అప్పుకుప్పలా పెరిగిపోయింది.

మొదటిసారి బాకీ చేయడమే తప్పు. ఒకసారి బాకీచేస్తే అదే నెమ్మదిగా అలవాటైపోయిద్ది! అయిన బాకీలు ఇప్పుడు తనని కొండచిలువలా చుట్టుముట్టాయి.

తను ఇలా బాకీల పాలు కావడానికి కారణం తన భార్య శాంతమ్మే. ఆమె వలనే తను ఇంతగా అప్పుల పాలై అవస్థలు పడటం.

ఆలోచిస్తూ, మనసులో బాధపడుతూ గొడ్ల దగ్గరకి వచ్చాడు బుచ్చియ్య. అప్పటికి ఇంకో ఐదారుగురు గొడ్లు తోలుకొచ్చి అక్కడొకరూ, అక్కడొకరూ నిలబడి మేపుకుంటున్నారు.

"గొడ్లు ఎటూ పోలేదుగా అప్పా? ఇబ్బందేం పెట్టలేదుగా?" అడిగాడు రంగమ్మని, తన గొడ్లవైపు చూస్తూ.

"ఎక్కడికి పోయి చస్తయ్యిలే. చేన్ని దున్నిచ్చావా?"

"దున్నిచ్చలేదు అప్పా. వాన పడితే దున్నిద్దామనీ..."

"ఏం వాన, మాయదారి వాన! అట్టా, ఇట్టా ఉలికిచ్చడమే తప్ప సరైన వాన ఒక్కటీ పడి చావకపోయ!. తాగడానికి నీళ్ళు లేకపోయా. గొడ్లు ముకాన మేత లేకపోయా. చెడివానో, పడివానో పడితే గడ్డాగాదమో దొరికిద్ది గొడ్లుకి. వాన ఆశే లేకపోయా!"

"కలికాలం అంతానికి వచ్చింది. పంటలు ఇంక పండవు అప్పా. ఇయ్యేడూ కరువే. వరుసగా ఇది ఐదోఏడు. ఇంక రైతులు అడక్కతిని బతకాల్సిందే"

"అడక్క తినాలన్నా ముద్దవేసే ఉండొద్దూ" అన్నాడు బుచ్చియ్య.

పైటేల దాకా గొడ్లు మేపుకుని, వెనక్కి మలిపాడు.

"గొడ్లు తోలకపోతన్నాను అప్పా. ఇంటికాడ పిల్లలొక్కరే ఉండారు. అది కూలికి పోయింది."

"ఇప్పుడు కూలి ఎక్కడ దొరుకుతంది?"

"పాలెంలో బాయి కింద నూగు వేసారంట. కోతకి పోయింది"

"వానైనా వరదైనా, ఎండైనా గాలైనా నీ పెళ్లాం ఇంటికాడ ఉండే మడిసికాదు. పని దొరకితే పాలెం ఏందీ పట్నం అయినా పోయిద్ది. పని తపనే" రంగమ్మ అంది.

"సంపాదించి కుప్పలు పోసింది" భార్య మీద ఉన్న అసంతృప్తితో నిరసన స్వరంతో అంటూ కదిలాడు బుచ్చియ్య, ఇంటి దగ్గర పిల్లలు ఎలా ఉన్నారో అనుకుంటూ.

గొడ్లు తోలుకుని ఇంటికి వస్తున్నా మనసులో ఆందోళనగానే ఉంది బుచ్చియ్యకి, సమస్యని ఎలా పరిష్కరించుకోవాలో అని. ఇప్పటికే అలస్యమై చాలా వరకూ మునిగిపోయాడు. తొందరపడకపోతే నిండా మునిగిపోవడం ఖాయం. ఉన్న బాకీల్ని ఏదో ఒకదారి చేసుకోవాలి.

వడ్డీతో వడిగల గుర్రం కూడా లగెత్తలేదంట.

తను తిన్నా, తినకపోయినా, కూచున్నా, నించున్నా, పొద్దు పొడిచినా, పొద్దు గూకినా దానిపాటికి అది ఆగకుండా పెరుగుతూనే ఉండిద్ది. వంద రూపాయల అప్పు మూడు రూపాయల వడ్డీకి తెస్తే రోజుకి పదిపైసల వడ్డీ

పడిద్ది. పది పైసలు ఎవడికో ఊరికే ఎందుకు ఇవ్వాలి? పిల్లవాడికి బిస్కత్తు అయినా వచ్చిద్ది.

తనకి లెక్క తెలీకా కాదు, లెక్కలు రాకా కాదు. పెళ్లాం. ఆమె పోరు పడలేకనే తను ఈ అప్పుల ఊబిలో చిక్కుకోవడం. ఊబి నించి బయటపడాలి.

పొద్దున నిద్రలేచి నీళ్లకి పోతుంటే సత్తెం ఎదురుపడి బాకీ తీర్చమని అడిగాడు. పొలం కొనడానికి ఆయన దగ్గర తీసుకున్న బాకీ తొందరగా ఇచ్చి నోటు రద్దు చేసుకోకపోతే బాగుండదనుకుంటూ ఇల్లు చేరాడు.

శాంతమ్మ ఇంకా పని నించి రాలేదు. పిల్లలు ఆటలకి వెళ్లారు.

బుచ్చియ్య గొడ్లకి కుడితి పెట్టి కట్టేశాడు. కాళ్లు పీకుతున్నట్లుగా అనిపిస్తే, కుక్కి నులకమంచం వాల్చుకుని, తల కింద కండవా పెట్టుకుని పడుకున్నాడు.

"ఏం బుచ్చియ్యా... నీ పని రొక్కంగా ఉంది. కాలిమీద కాలు వేసుకుని సుకంగా పడుకున్నావు, దిగులూ యిచారమూ లేకుండా! ఇయ్యాల అప్పులు ఇచ్చినోళ్లు దిగులుపడతన్నారు గానీ తీసుకున్నోళ్లకేంలే. అయితే ఆ ఒడ్డూ, కాకపోతే ఈ ఒడ్డూ" రోడ్డుమీద నించే పెద్దగా అంటూ రమణయ్య వచ్చాడు.

అప్పుడే అలా పడుకుని కళ్లు మూసుకున్న బుచ్చియ్య, రమణయ్య మాటలు చెవిన పడటంతో ఒక్క ఉదుటున మంచం మీద నించి లేచాడు.

రమణయ్య వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

"నేల తగుల్తంది. కొత్త నులక అల్లుకోకూడదూ? నులకంతా తెగిపోయింది" అన్నాడు.

"అల్లుకున్నట్టే ఉంది రమణయ్యా మా పనీ..."

"మీ పనికేంరా? మొగుడూ పెళ్లాం ఇద్దరూ నాగా లేకుండా పనికి పోయేవాళ్లు"

"పనికిపొయ్యేం లాభం? కలిసి రాని కాలంలో అడక్క తినడానికి పోతే ఉన్న బొచ్చె కాస్తా ఊడ్చుకుని పోయిందంట. చివరికి అట్టయింది మా పని"

"కానియ్యరే. రోజులు ఎల్లకాలం ఒకే రకంగా ఉంటాయంట్రా? అసలు మీకేంరా? బేంకిలో మీకు చాలా డబ్బు మూలుగుతోందని ఊళ్లో అనుకుంటన్నారు కదరా."

"నిజమేలే, డబ్బు మూలుగుతుంటే మీలాంటివాళ్లందర్నీ ఇంటి చుట్టూ ఎందుకు తిప్పించుకోటం? చెపలమా పిచ్చా?"

"మీ సొంత డబ్బు అట్నే ఉండాల. ఇచ్చినోళ్లే మునిగిపోతారుగా"

"లోకులకేంలే! రకరకాలుగా అనుకుంటారు. ఆయన్నీ నిజమనుకుంటే ఎట్ట?"

"సరే. పిల్లపెళ్లి పెట్టుకున్నాంరా. నువ్వు ఎక్కడైనా తంటాలు పడు. బాకీ ఇయ్యేదు చూడాలా.మీరు ఇస్తేనే పిల్ల పెళ్లి జరిగిద్దీ, లేకపోతే ఆగిపోద్దీ."

"మొన్ననే చెప్పాను కదన్నా, పొలం అమ్మి అయినా బాకీలు తీరుస్తామని. మాకు మాత్రం తెలియదా వడ్డీలు పెరుగతయ్యనీ. ఇంకా ఆగితే అసలు తట్టుకునే ఎవారమేనా?"

"మూడు నెలల నించీ ఇదే మాట అంటన్నావు కదరా పొలం అమ్మి బాకీ తీరుస్తానని! ఏదైనా తొందరగా చూడ్రా. నువ్వు డబ్బులు ఎప్పుడు ఇస్తే అప్పుడు లగ్గాలు పెట్టుకుంటాం. నీ మీద ఆధారపడి ఉంది నా బిడ్డ బతుకు. నీట ముంచినా పాల ముంచినా నీదే భారం" అని రమణయ్య వెళ్ళిపోయాడు.

రమణయ్య కూడా తనలాంటి చిన్నరైతే. అయితే జాగ్రత్త కలిగిన మనిషి. తెలివి కలిగినవాడు.

రమణయ్యకి మూడు ఎకరాల పొలం ఉంది ఆ పొలం మూడేళ్ళ నుంచీ బుచ్చియ్య వాళ్ళు మగతాకి చేసుకుంటున్నారు. ఆ పొలం కౌలుకి తీసుకుని పైరు వేయడం బుచ్చియ్యకి ఏ మాత్రం ఇష్టం లేదు.

"మనకి ఉన్న రెండెకరాల పొలం సరిగా పండించుకుంటే చాలు. ఎందుకే మగతా పొలం? పండినా పండకపోయినా వాళ్ళకి మగతా కట్టాలి. మంచం ఉన్నంతలోనే కాళ్ళు ముడుచుకుంటే పోయేదానికి ఎందుకూ లేని పోని ఆశలు? రూపాయి వస్తే తినేవాళ్ళమేకానీ రాకపోతే ఏమయిద్ది మన పని?" అన్నాడు బుచ్చియ్య, మొదట్లో పొలం మగతాకి తీసుకుందాం అని భార్య అన్నప్పుడు.

"కానియ్యయ్యా. గొర్రెతోక బెత్తెడే అనీ... ఎంత కాలం కూలీనాలీ చేసుకుంటే నాలుగు రూపాయలు మిగుల్తాయి? పొలం పండాలీ, పంటతో ఇల్లు నిండాలీ, దబ్బు రావాలీ కానీ కూలి చేసుకుని కుబేరుడు అయినోడు ఎవుడున్నాడు? కూలికి పోతే కుండమాడిద్దీ, కడుపు నిండిద్దేమోకానీ రేపటికి ఏం వుండిద్దీ.... బూడిద!"

"కుబేరుడు కావాలంటే అయ్యే పనేనా? మనిషికి మించిన ఆశ పనికి రాదు. మనకి ఉన్న పొలం జేగర్తగా పండించుకుందాం. కుటుంబం ఎల్లబారి పోయిద్ది. ఆశ అనర్థం దురాశ దుఃఖం"

"లోకుల సొమ్ము తేరగా కావాలనుకోవడం దురాశ కానీ పొలం మగతాకి తీసుకోవడం దురాశా? ఇంటిల్లిపాదిమీ చాకిరీ చేసుకుందాం. పంట పండించుకుందాం. కర్చులు పోయి కూలి పాటు అయినా మిగలక పోయిద్దీ? బూదేవిని నమ్ముకుని చెడిపోయినోడు ఎవుడూ లేదు. మగతాలకి పొలం

తీసుకుని బాగుపడినోళ్లు ఎంత మంది లేరూ" అని ఉదాహరణలతో చెప్పింది శాంతమ్మ.

"ఒకరితో మనకి వంతు వద్దే, ఏది పోయి ఎట్ట వచ్చినా"

"ఏదీ పోదు. పొలం తీసుకోవాల్సిందే" అని గట్టి పట్టు పట్టింది శాంతమ్మ.

తనకంటే శాంతమ్మ తెలివి కలిగినదేమో అని తనకి ఒక గుడ్డి నమ్మకం. మనసులో ఇష్టం లేకపోయినా కాదంటూనే చివరకి ఆమె చెప్పినట్లు విన్నాడు. నిండా మునిగిపోయాడు.

శాంతమ్మ ఇంట్లో తన మాటే నెగ్గాలని ప్రయత్నించినా, బయటివాళ్ళ ముందు మాత్రం భర్త మాటకే విలువ ఇచ్చినట్టూ, ఆయన చెప్పినట్టే నడుచుకుంటన్నట్టూ మాట్లాడేది.

రమణయ్య పొలం కౌలుకి ఇస్తున్నట్లు తెల్సింది.

వెళ్ళి అడిగాడు.

"రేపు పంట ఇంటికి వచ్చిన తరువాత మీరు మగతా ఇచ్చేదేమిటో పెట్టేదేమిటో? ముందుగానే ముకబదులు కట్టి పొలంలో అడుగు పెట్టండి" అన్నాడు రమణయ్య కరాఖండిగా.

బుచ్చియ్య అయిష్టంగానే ఒకరి వద్ద అప్పు తీసుకొచ్చి, రమణయ్యకి ముందుగానే మగతా చెల్లించి పొలంలో పంట వేశాడు.

వ్యవసాయంలో ఆ ఏడు పూరంతా దండగలే.

బుచ్చియ్యకి మాత్రం దానికీ దానికీ చెల్లూ, దారి పట్టుకు వెళ్లూ. రూపాయి మిగల్లేదూ, చేతి డబ్బు వదల్లేదూ.

మరుసటి ఏడు కూడా తీసుకుందామంది శాంతమ్మ.

"ఎందుకే? పొలంలో గొడ్లు మాదిరిగా పని చేశాం! చివరికేం మిగిలింది? మిగలని కాడికి ఒంటికి ఎందుకు లేని పోని దురద? కౌలుకి పొలం వద్దూ పాడు వద్దూ"

"ఇద్దరం చేసే ఈడులో ఉండాం. కాలం ఎప్పుడూ ఒక రకంగా ఉండిద్దా? పొలం తీసుకోవాల్సిందే. అటో ఇటో తేల్చుకోవాల్సిందే" అని పంతం పట్టింది శాంతమ్మ.

"మనకంటే గట్టి పనోడు రమణయ్య. గట్టి పంట పండిస్తాడు. తెలివి తక్కువోడయి పొలం మగతాకి ఇస్తన్నాడనా? మగతా మాత్రం మిగలకపోతంటేనే ఇయ్యడం"

"మిగల్నయ్యా, తగల్నయ్యా... పొలం వెయ్యాల్సిందేనయ్యా. నిరుడు పండలేదు కాబట్టి ఇయ్యేడు బాగానే పండిద్ది. రేట్లు కూడా బాగుంటయ్. వానలు కూడా బాగా పడతన్నయ్" అని కూర్చుంది శాంతమ్మ.

చివరికి బుచ్చియ్య అంగీకరించక తప్పలేదు.

రెండో ఏడూ ముందుగానే మగతా కట్టమన్నాడు రమణయ్య

"మా దగ్గిర రూపాయి లేదు రమణయ్యా! సీజన్‌లో ఇస్తాం. కావాలంటే నోటు రాయించుకో. రూపాయి వడ్డీ కట్టుకో. డబ్బు కట్టి చేలోకి దిగమంటే మా వల్లకాదు. ఎవురికో ఇచ్చుకో పొలం!" అన్నాడు బుచ్చియ్య.

ఊళ్ళో పొలం మగతాలకి తీసుకునే వాళ్ళుకూడా లేరు. రమణయ్యకి ఆ విషయం తెల్సు. అప్పుగానో సప్పుగానో ఇస్తే ముందు తనకి భారం వదిలిద్ది. వాళ్ళ నెత్తిమీద పెడితే వాళ్ళే తంటాలు పడతారు. రేపు పండేనో, పోయేనో.

"సరే అట్నే చేయి అయితే" అని నోటు రాయించుకుని పొలం ఇచ్చాడు.

రెండో ఏడు రమణయ్య పొలం మీదనే పది వేలు దండగ వచ్చింది.

మూడో ఏడు మళ్ళీ పొలం వేయాలంది శాంతమ్మ.

బుచ్చియ్య ససేమిరా కాదన్నాడు.

"బాకీలు ఎట్ల తీరుస్తాం? పొలంలో దండగని పొలంలోనే పూడ్చుకోవాలి. ఎల్లకాలం దండగలు వస్తంటే రైతు ఏం బతుకుతాడు. పొలం అన్న తరువాత ఒక ఏడు దండగలు వస్తంటయ్. ఒక ఏడు లాభాలు వస్తంటయ్. చీకటి పగలూ! పోయినేడు అందరికీ నష్టాలు రావడంతో మగతాలు కూడా బాగా తగ్గినయ్యి. ఈ తక్కువ మగతాల్లోనే మిగుల్చుకో వచ్చు. తీసుకుందాం" అంది శాంతమ్మ.

"వద్దొద్దు. మనకి పొలం వద్దు. కూలి చేసుకుని బాకీలు తీరుద్దాం. నష్టాలు వస్తే ఇంక మనం లేచే పనిలేదు" అన్నాడు బుచ్చియ్య.

"కూలి చేసుకుంటే కూటికి జరిగిద్ది కానీ డబ్బులు మిగుల్తయ్యా? అదీ బాకీలు తీర్చుకోవడానికి. అదేం కాదు కానీ పొలం వేద్దాం" అని మంకు పట్టు పట్టింది.

"సరే" అనక తప్పలేదు బుచ్చియ్య.

మూడో ఏడు కూడా మగతాకి నోటు రాసి ఇచ్చి పొలం వేశారు. చివరికి దండగ వచ్చింది.

శాంతమ్మ పాపం పొలంలోనే నిద్రపోయింది. పొద్దు పొడవడం, పొద్దు గూకడం పొలంలోనే చూసింది. కోడి కూయక ముందే లేచి, అన్నం కూర

వండి, పెద్ద పిల్లవాడ్ని నిద్రలేవగొట్టి, జాగ్రత్తలు చెప్పి పొలం వెళ్ళేది. ఆమె ధ్యాస, ఆశ, తపన అంతా పంట మీదనే!

"మా ఆయన వద్దనే కొద్దీ నా బలవంతం మీదనే ఇయ్యేదు పొలం మగతాకి తీసుకున్నాం. దండగపడితే ఆయన నన్ను ఇక బతకనియ్యడు. జేగర్తగా చేసుకుని, పొలం పండించుకుని బాకీలు తీర్చుకోవాలి. ఈ పంట పండితేనే నాకు బతుకు. ఇదే మాకు ఆధారం" అని పొలం మీద శతవిధాలా పోరింది శాంతమ్మ.

వాన మీద ఆధారపడిన పంట! పైన వానే లేకుంటే శాంతమ్మ ఎంత పోరినా ఏం లాభం?

చివరికి మూడో ఏడూ ముదనష్టమే!

పొలం పెట్టుబడి కోసం తెచ్చిన బాకీలూ, రమణయ్య కౌలుబాకీ, పొలం కొనడానికి చేసిన బాకీ, కొంత అప్పుచేసి కొన్న బరిగొడ్లు బాకీ అన్ని నిలబడిపోయాయి.

ఆ బాకీలు తలుచుకుంటుంటే బుచ్చియ్యకి గుండె ఆగిపోయేలా ఉంది.

బాగా పొద్దుపోయి శాంతమ్మ ఇంటికి వచ్చింది.

'ఏ జాం అవతందే? ఇప్పటిదాకా ఏం చేశారు?"

"టాక్టరు వచ్చిద్దీ, మిమ్మల్ని వదిలిపెట్టి వస్తాం అని చీకటి పడిందాకా చేలోనే ఉంచి చచ్చేదు ఆ ఆసామి. టాక్టరు వచ్చిద్దని ఆశపడి చీకటి పడిందాకా ఉంటే అది ఎక్కడో చెడిపోయిందంట. చివరికి కాళ్ళూ కాళ్ళూ కొట్టుకుంటూ ఈ జామున నడిచి వచ్చేం!"

విషయం ఎలా ప్రస్తావించాలా అని బుచ్చియ్య చుట్ట తాగుతూ మంచానికి అడ్డంగా పడుకున్నాడు.

"నీళ్ళ కాగుపొయ్యి మీదనే ఉండే! రెండు పుల్లలు పెట్టిపొయ్యి కింద మంటేస్తే అరిగిపోతా?" అసహనంగా అంటూ శాంతమ్మ నీళ్ళు కాగపెట్టుకుంది.

నాలుగు మైళ్లు నడిచిపోయి, చీకటి పడేవరకూ పనిచేసీ, తిరిగి నడిచి రావడంతో శాంతమ్మకి బాగా బడలికగా ఉంది.

ఉడుకుడుకు నీళ్ళు పోసుకుని ఇంట్లోకి వచ్చి అన్నం పెట్టుకుంటోంది.

"రమణయ్య వచ్చిపోయాడే!" విషయం ఎప్పుడెప్పుడు తేల్చి పారేద్దామా అని తొందరపడుతున్న బుచ్చియ్య లోపలికి వచ్చి అన్నాడు.

శాంతమ్మ ఏం మాట్లాడలేదు.

"పొద్దున బజారులో సత్తెం కూడా నిలబెట్టి అడిగాడు."

"అయితే ఏం చేద్దామంటా?"

"డబ్బులు వాళ్ళకి ఇయ్యేదు ఇయ్యకపోతే బాగుండదు."

"తీసకొచ్చి ఇయ్యి."

"రమణయ్య కూతురి పెళ్ళి పెట్టుకున్నాడంట. మనం ఇస్తేనే లగ్గాలు పెట్టుకుంటాం అంటన్నాడు."

"మనం వాళ్ళ చేలో రూపాయి తినలా. పైగా పదీ పన్నెండేలు దండగ పడ్డాం. పైరు ఆయన వేసుకుంటే ఆ దండగ ఆయనకే రాకపోయిందీ. ఆయనకి ఎంతో మేలు చేసినట్టు మనం. ఆయన డబ్బుకి మనల్ని వత్తిడి చేయొచ్చా"

"మనం దండగ పడిన దానికి అయనేం చేస్తాడే? ఆయన మగతా ఆయనకి ఇయ్యాలా, వన్లేదా?"

"ఇయ్యాల్సి ఉంటే ఇస్తాం. మనకి వెసులుబాటు కావాలిగా. తొందరపడితే ఎట్ట?"

"నోటు కూడా రాసిస్తిమీ. మనకి వడ్డీ కూడా పెరుగుతుండిద్దాయె. ఇచ్చేస్తే భారం కూడా తగ్గిద్ది"

"తెచ్చి ఇయ్యి. నువ్వు ఇస్తానంటే నేను వద్దంటానా?"

"అసలు బాకీల వాళ్ళని ఇంటిచుట్టూ తిప్పిచ్చుకోవడం ఏందీ? ఎంత నామర్దా ఎవారం? మా అయ్యకాలం నుంచీ మేం బాకీ పడి ఎరగం. ఒకరు ఇంటికి వచ్చి డబ్బు ఎప్పుడు ఇస్తావని నిలేసిన వాళ్ళులేరు"

"అయితే నువ్వు అనేది ఏందీ?

"నీ గుండానే ఈ గతి పట్టింది. మనకి పొలం వద్దే అంటే నా మాటని ఏమన్నా ఆలకిచ్చా? నీ పంతం నెగ్గిందాకా ఊరుకోకపోతివీ. చివరికి ఇల్లూ వొళ్ళూ రెండు గుల్లయ్యే!"

"ఇట్ట దండగల పాలవతామని ఎవురన్నా కలగన్నారూ. మిగుల్తయ్యని పొలం వేసుకుంటామా, దండగలు పడతామని పొలం వేస్తామా?"

"ఏదైతేనేం లే. కాపరం నాశినం చేసిందాకా నీకు నిదరపట్టలా. బాకీల వాళ్ళు నన్నే అడుగుతారు కానీ నిన్ను కాదుగా! వాళ్ళని ఇళ్ళచుట్టూ తిప్పిచ్చుకోటం, వడ్డీలు కట్టడం ఇదంతా ఎందుకు? ఒక పొలం అమ్మి బాకీల వాళ్ళకి ఇస్తే దిగులూ యిచారమూ ఉండదుగా!"

"మూడు నెల్లునించీ ఉండ జాతరేగా! అమ్మా, వందల ఎకరాల చదరాలు ఉండే, ఒక చదరం అమ్మి బాకీ తీర్చు!"

"మది బాకీలు ఎట్ట తీరుద్దాం?"

"ఎట్ట అంటే... ఎట్నో తీరుద్దాం. అంతేగనీ పొలం అమ్ముకుంటాం?"

"వాళ్ళకి ఇస్తానని చెప్పానే! మళ్ళీ మాటపోయిద్ది. వడ్డీలు పెరుగుతున్నయ్. ఈ బాకీలు తలుచుకుంటే రేత్రిపూట నాకు నిద్ర కూడా పట్టడంలా! మనం కొన్న పొలం రేపు బేరానికి పెడతా. ఇంక ఎదురు మాట్లాడవాకు!"

"పిచ్చి పట్టిందేంది? పొలం అమ్ముకునేదేందీ? అమ్మి ఏం చేస్తా? అదక్క తింటానికి పిల్లలకి ఒక బొచ్చా, నాకు ఒక బొచ్చా ఇచ్చి అమ్ము పొలం. బరి గొడ్లు, పొలమూ అన్నీ అమ్ముతాడంటనే. అమ్మి ఏం చెయ్యాలనీ... నా బొందిలో పేణం ఉండగా అమ్మడం జరగదు. ఏమనుకున్నావో!"

"నీ పెత్తనం ఏందే?"

"నా పెత్తనం కాక... నీ పెత్తనం సాగాలా ఏందీ?"

ఇక మాటా మాటా పెరిగింది.

"నువ్వెంత" అంటే "నువ్వెంత", "నీదేంది" అంటే "నీదేంది?" అనుకున్నారు.

చినుకు చినుకే గాలివాన అయింది.

"కాపరం నాశినం చేసింది కాక మొగోడ్ని పట్టుకుని ఎంత మాటపడితే అంతమాట అంటావంటే?" అంటూ బుచ్చియ్య, కూర్చుని అన్నం పెట్టుకుంటున్న శాంతమ్మని జుట్టు పట్టుకుని వంగతీసి, వీపు మీద దభీ దభీమని పిడిగుద్దులు గుద్ది విసురుగా వెనక్కి నెట్టాడు.

శాంతమ్మ వెళ్ళి గోడకి కొట్టుకుంది.

గోడకి ఉన్న మేకు తల వెనుక బలంగా తగలడంతో రక్తం ధారలు కట్టింది.

అంతే. శాంతమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఆగ్రహోదగ్రురాలైంది.

అక్కడే మూలన ఉన్న కత్తిపీట తీసుకుంది.

"ఈ సారి పైకిరా.... నరికి పారేస్తా! మొగోడంటనే పెద్ద మొగోడు! ఆడదాన్ని కొట్టడమా మొగోడితనమంటే? ఎందుకు గోల, ఇంటి గుట్టుని రచ్చ ఎందుకు చేసుకోవాలని తలకాయ వంచుకుని పోతంటే పెట్రేగిపోతన్నావే. కాపరాన్ని నేను నాశనం చేశానూ.... ఊరంతా తిరిగి తప్పెట వేస్తా? ఇంటో వాగితే వాగావు అనుకో. వీదిలో కూడానా! మజ్జెన్నం గొడ్ల కాడ రంగమ్మ వదిన తోటి ఏందీ నువ్వు అందీ? కౌలుకి పొలం వేసుకోవడం నేరమా? అందుకు నేను నాశినం చేశానూ కాపరాన్నీ. అప్పులోళ్ళు నిన్ను ఎవురన్నా అడుగుతుంటే నా దగ్గరికి పంపిచ్చు. నేను చెబుతా సమాధానం! అంతేగనీ

ఇంక ఎక్కువ తక్కువ మాట్లాడావంటే మర్యాద్దక్కదు. ఇప్పటిదాకా పరువు కోసం పాకులాడాను కానీ నిన్ను చూసి భయపడి కాదు. ఇంకేం పరువూ మర్యాదా? ఇప్పటిదాకా ఈ శాంతమ్మ శాంతాన్నే చూశావు. ఇంక మంచిగా ఉంటే మంచీ, చెడుకి తిరిగితే చెడే! జాగ్రత్త..."

శాంతమ్మ రౌద్రావతారాన్ని చూసిన బుచ్చియ్యకి నోటి మాట రాలేదు. వణికిపోయాడు. బైటికి వెళ్ళి కిక్కురుమనకుండా మంచం మీద దుప్పటి ముసుగు పెట్టి పడుకున్నాడు.

**ఆదివారం ఆంధ్రజ్యోతి - 07 నవంబర్, 2004**